## ఫ్లయ్ ఓవర్ నిర్మాణానికి స్థల సేకరణ

**ప్రజాశక్తి - తణుకురూరల్**

మండలంలోని తేతలి, పైడిపర్రు జాతీయ రహదారి ఫ్లైఓవర్ నిర్మాణానికి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి గురువారం స్థల పరిశీలన చేశారు. తేతలిలో 1.80 ఎకరాలు, పైడిపర్రులో 24 సెంట్ల భూమిని పరిశీలించారు. అనంతరం ఇందుకు సంబంధించిన మ్యాప్‌లు, రూట్ మ్యాప్‌లను పరిశీలించి అధికారులను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జెసి వెంట ఇన్‌ఛార్జి తహశీల్దార్ కె.ఉదయ భాస్కర్, మండల సర్వేయర్, సిబ్బంది ఉన్నారు.

మ్యాప్ పరిశీలిస్తున్న జెసి

# బదిలీల మాయాజాలం..!

**నిబంధనల ముసుగులో ఇష్టారాజ్యం**

**పరిపాలనా అవసరాల రీత్యా పేరిట అడ్డగోలు బదిలీలు**

**పెద్దఎత్తున సొమ్ము చేతులు మారినట్లు ఆరోపణలు**

**బదిలీలపై సమాచారం ఇచ్చేందుకు అధికారుల వెనుకంజ**

**శాఖల వారీగా బదిలీల జాబితా బయటపెడితేనే వాస్తవాలు వెలుగులోకి**

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

జిల్లాలో బదిలీల ప్రక్రియ ఓ మాయాజాలంలా మారింది. నిబంధనల ముసుగులో తమకు నచ్చినవారికి నచ్చినచోట పోస్టింగులు ఇస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బదిలీల సమాచారం ఇచ్చేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్న తీరు సైతం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ నెల 22వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ బదిలీలలకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకేచోట ఐదేళ్ల కాలం పూర్తి చేసుకున్న ఉద్యోగులకు బదిలీ తప్పనిసరని, ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి ఒకేచోట రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులు రిక్వెస్ట్ ప్రాతిపదికన బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొంది. అదే సమయంలో మరో అంశాన్ని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో భాగంగా పని చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులను బదిలీ చేసే అవకాశాన్ని ఇచ్చింది. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో భాగంగా అనే అంశాన్ని పలు శాఖల్లో అధికారులు తమకు అనుకూలంగా ఉపయోగించుకున్నారని, బదిలీల ప్రక్రియను ఇష్టానుసారంగా మార్చేశారని తెలుస్తోంది. ఒకేచోట రెండేళ్లు పూర్తికాని ఉద్యోగులను అడ్మినిస్ట్రేటివ్ అంశం అంటూ బదిలీల జాబితాలో చేర్చినట్లు తెలుస్తోంది. అడ్మినిస్ట్రేటివ్ అనే అంశం వర్తించాలంటే సదరు అధికారి పని చేయకుండా, రిమార్కు ఉంటేనే వర్తిస్తుందని చెబుతున్నారు. అదీ పెద్ద కేడర్‌లో ఉన్న అధికారులకే ఇది వర్తించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. బదిలీల ప్రక్రియలో అవన్నీ పక్కనపెట్టి అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ ప్రాతిపదికన అంటూ ఇష్టానుసారంగా బదిలీలు చేసినట్లు తెలుస్తోంది. రెవెన్యూ, పంచాయతీరాజ్ ఇలా బదిలీల ప్రక్రియ జరిగిన అన్ని శాఖల్లోనూ ఈ తంతు నడిచినట్లు చెబుతున్నారు. ఈ ప్రక్రియలో పెద్దఎత్తున మామూళ్లు చేతులు మారినట్లు ప్రచారం సాగుతోంది. తమకు నచ్చిన అధికారులను నచ్చిన చోటుకు బదిలీ చేసినట్లు చెబుతున్నారు. బదిలీల తంతుపై ఉద్యోగుల్లో తీవ్రమైన చర్చ సాగుతోంది. ఎంఎల్ఎలు, మంత్రుల సిఫార్సు లేఖలు ఉంటే చాలు నిబంధనలతో సంబంధం లేకుండా ఏదోకటి పేర్కొంటూ బదిలీ చేసేసినట్లు సమాచారం.

### బదిలీల జాబితాను బయట పెడతారా..?

ఉద్యోగులు బదిలీల ప్రక్రియ పూర్తయినట్లుగా అధికారులు చెబుతున్నారు. పలు శాఖలకు సంబంధించి పోస్టింగులు ఇచ్చేయడం, ఉద్యోగులు చేరిపోవగడం కూడా జరిగిపోతుంది. అయితే ఏ శాఖలో ఎంతమంది బదిలీ అయ్యారు. బదిలీ అయిన ఉద్యోగులకు సంబంధించిన జాబితాను మాత్రం అధికారులు బయటపెట్టడం లేదు. గతంలో ఎంపిడిఒ, తహశీల్దార్ల బదిలీలతో పాటు అన్నిశాఖలకు సంబంధించిన బదిలీల జాబితాలను మీడియాకు ఇచ్చేవారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. బదిలీల ప్రక్రియ అంతా గోప్యంగా సాగుతున్న పరిస్థితి నెలకొంది. జాబితా బయటపెడితే బదిలీల్లో డొల్లతనం బయటపడే అవకాశం ఉందని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో భాగంగా బదిలీ చేస్తే అందుకు సంబంధించిన రిమార్కులు రాయాల్సి ఉంటుంది. అలాంటి అధికారులు ఎంతమందిని బదిలీ చేశారో వివరాలు బయటపెడితే బదిలీలో పారదర్శకత ఎంతో తేలనుంది. రెండేళ్ల సర్వీసు పూర్తికాని ఉద్యోగులంతా రాజకీయ, అధికారుల పలుకుబడి ఉపయోగించుకుని నచ్చినస్థానానికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా బదిలీల ప్రక్రియకు సంబంధించిన జాబితాను శాఖల వారిగా బయటపెట్టాలని అంతా కోరుతున్నారు.

## సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి

**రైతు భరోసా చెక్కు అందజేత**

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం 2023-24 గాను వైఎస్ఆర్ రైతు భరోసా, పిఎం కిసాన్ కింద వరుసగా ఐదో సంవత్సరం మొదటి విడత ఆర్థిక సాయం నగదు బదిలీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పత్తికొండ, కర్నూలు జిల్లా నుంచి ప్రారంభించి బటన్ నొక్కి నేరుగా అర్హులైన రైతుల ఖాతాల్లోకి జమచేశారు. స్థానిక విష్ణు కాలేజీ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన రైతు భరోసా, సిఎం కిసాన్ పథకం జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఏ మాత్రమూ రైతుకు ఒత్తిడి లేకుండా రైతు భరోసా మొత్తం రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతోందన్నారు. రైతులందరికీ సాగు ఖర్చు కింద పెట్టుబడి సాయం అందించాలనే ఉద్దేశంతో అర్హులైన ప్రతి రైతు కుటుంబానికీ సంవత్సరానికి రూ.13,500 చొప్పున జమ చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రైతుల సంక్షేమం కోసం ఆర్‌బికెలు ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, నియోజక వర్గానికి ఒక అగ్రిలాబ్స్ ఏర్పాటు చేసి నిపుణులతో సాగు కొరకు సలహాలు ఇస్తూ, వారికి విత్తు నుండి పంట కోత వరకూ అన్నివిధాలా సహాయం అందజేస్తోందన్నారు. ఆర్‌బికెల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలులో బియ్యం ముక్క శాతం ఎక్కువ రావడం ఇబ్బందిగా మారిందన్నారు. ఇటువంటి రకాలను పండించడం నిలిపివేయాలన్నారు. ఈ క్రాఫ్ నమోదు వల్ల ఎంతో లాభం జరిగిందన్నారు. జిల్లాలోని 1,18,113 లక్షల మంది రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా, సిఎం కిసాన్ ద్వారా 5వ సంవత్సరం మొదటి విడత కింద రూ.88,58,47,500ల నమూనా చెక్కును అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాసరావు, సభ్యులు కొట్టి కుటుంబరావు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎ.దుర్గేష్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.మురళీకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

తణుకు రూరల్‌లో బ్రిజ్ భూషణ్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న నేతలు

తాడేపల్లిగూడెంలో సిఐటియు నేతల నిరసన

ఉండిలో సిఐటియు నేతల నిరసన

## విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం పొందాలి

**జిల్లా కలెక్టర్ ప్రశాంతి**

**ప్రజాశక్తి - భీమవరం**

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ద్వారా విద్యార్థులు వివిధ క్రీడల్లో ప్రావీణ్యత పొందాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి తెలిపారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ చేతుల మీదగా వేసవి శిక్షణ శిబిరాలకు అవసరమైన రూ.2.75 లక్షల విలువైన క్రీడా సామగ్రిని సంబంధిత ఇన్‌ఛార్జిలకు అందజేశారు. జిల్లా క్రీడా ప్రాధి కారిక సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని 50 ప్రాంతాల్లో మే 1 నుంచి జూన్ 10వ తేదీ వరకూ వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఒకొక్క శిబిరానికి రూ.5,500 విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివిధ క్రీడాంశాల్లో ఇచ్చే వేసవి శిక్షణ శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంతోమంది నైపుణ్యం గల క్రీడాకారులు ప్రతిభ ఉండి పేదరికంతో ముందుకు రాలేకపోతున్నారన్నారు. అటువంటి వారిని గుర్తించి మంచి క్రీడాకారులుగా తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ శ్రీరామ్ రమేష్‌బాబు, ఫిజికల్ డైరెక్టర్లు ఎం.శివ, జివిఎస్ శేఖర్‌రాజు, రాజేంద్ర రామభద్రరాజు, విద్యార్థులు ఉన్నారు.

# క్రీడాకారుల పట్ల కేంద్రం వైఖరి దుర్మార్గం

**రెజ్లర్లపై బిజెపి తీరును నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నాలు**

**ప్రజాశక్తి - భీమవరం**

దేశానికి అత్యున్నత పథకాలు తీసుకొస్తున్న భారత క్రీడాకారుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి దుర్మార్గంగా ఉందని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, ఎఐటియుసి జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు విమర్శించారు. రెజ్లర్ల పట్ల బిజెపి ఎంపీ వేధింపులను నిరసనగా భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ నడిబొడ్డులో గత కొంతకాలంగా బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని, క్రీడాకారులపై లైంగిక వేధింపులను అరికట్టాలని ఆందోళన చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు అనేకమంది క్రీడాకారులు, కళాకారులు, మేధావులు, అభ్యుదయవాదులు, రాజకీయ పార్టీలు క్రీడాకారుల ఆందోళనకు మద్దతుగా ఉంటే తట్టుకోలేని కేంద్ర ప్రభుత్వం ఆందోళనకారులపై కేసులు పెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి లైంగిక వేధింపులకు పాల్పడ్డ బిజెపి ఎంపీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, ఎం.ఆంజనేయులు, ఎం.వైకుంఠరావు, కె.సత్యనారాయణ, ఎం.మునీయ, వైవి.ఆనంద్, ఆకలి రాము, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం:** బిజెపి మంత్రి బ్రిజ్ భూషణ్ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేసి, ఆయనపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అన్నారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద న్యాయం చేయాలని కోరుతున్న ఒలింపిక్ మహిళా రెజ్లర్లకు సంఘీభావం తెలుపమని సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం తాడేపల్లిగూడెం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ ఐల్యాండ్ వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి మంత్రి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తే రానున్న రోజుల్లో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి జవ్వాది శ్రీను, నరమాల కృష్ణ, అగుర్తుల రామోహనరావు, కన్నంరెడ్డి శివాజీ, యడవల్లి వెంకన్న, పతివాడ నాగేంద్రబాబు, గొర్రెల వంశీ, శ్రీను పాల్గొన్నారు.

**తణుకురూరల్ :** రెజ్లర్లను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్న బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నరేంద్ర సెంటర్లో కార్మిక సంఘాలు, వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని నిరసన, ధర్నా నిర్వహించి అనంతరం ఎంపీ చిత్రపటాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు, ప్రతాప్ మాట్లాడుతూ దేశ ప్రతిష్టను క్రీడల ద్వారా ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన వారి పట్ల బిజెపి ఎంపీ వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. మోడీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. మాజీ ప్రిన్సిపల్ సంకు మనోరమ, ఐఎన్‌టియుసి నాయకులు దిర్శిపో రామకృష్ణ, సిఐటియు నాయకులు పి.దక్షిణామూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి.అమ్మిరాజు, బండి సత్యనారాయణ, శ్రీను, బి.కృష్ణకిషోర్, కామన మునిస్వామి, గార రంగారావు, ఎం.రమేష్, డి.మూర్తి, ఆదిలక్ష్మి, వి.కృష్ణవేణి, కడలి వీర్రాజు పాల్గొన్నారు.

భీమవరం : ఆందోళన చేస్తున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు

**ఉండి :** ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను పదవి నుంచి తొలగించి వెంటనే అరెస్టు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కొట్టాడ వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉండి మెయిన్ సెంటర్లో గురువారం రెజ్లర్లకు మద్దతుగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కొట్టాడ వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకులు ధనికొండ శ్రీనివాస్ మాట్లాడారు. 40 రోజులుగా రెజ్లర్లు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసన తెలియజేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా రెజ్లర్లు చేస్తున్న నిరసనకు కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి బ్రిజ్ భూషణ్‌ను పదవి నుంచి వెంటనే తొలగించాలని లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మజ్జి నాగేశ్వరరావు, కడలి నాగేశ్వరరావు, కట్టా రవి, జుత్తిగ లకుడు పాల్గొన్నారు.

## పాలకు మించిన పోషకాహారం లేదు

**పశువర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాఫర్**

**ప్రజాశక్తి - భీమవరం**

కల్తీ లేకుంటే పాలకు మించిన పోషకాహారం లేదని, కల్తీ జరగకుండా ప్రభుత్వమే నిరంతర పర్యవేక్షణ చేయాలని, చిన్నా, పెద్ద డైరీలు, సహకార సంఘాలు, నష్టాల బారిన పడకుండా సహకరించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎమ్‌డి.జాఫర్ అన్నారు. భీమవరం పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ప్రపంచ పాల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ, సుధీర్‌బాబు మాట్లాడుతూ పాలు 100 శాతం పోషక విలువలు, విటమిన్ బి12 అధికంగా కలిగిన ఆహారమన్నారు. యువత, విద్యార్థుల్లో, మానసిక, శారీక ఉత్సాహాన్ని, పెరుగుదలను, ఎముకల పటుత్వాన్ని కలిగిస్తాయన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక నాయకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ డైరీల్లో పాలు నిల్వవుండేందుకు అనేక రకాల రసాయనాలు కలుపుతున్నారన్నారు. వాటివల్ల పాలల్లో పోషకాల సంఖ్య తగ్గిపోతోందన్నారు. అనంతరం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గంటా సుందర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పశువర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాఫర్



పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీ తొలగింపును అంటుకుంటున్న జన సైనికులు

## విపత్తుల నుంచి పంట రక్షణకే ముందస్తు సాగు

**బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు, హోం మంత్రి వనిత**

**గోదావరి డెల్టా కాలువలకు నీరు విడుదల**

**ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి**

ప్రకృతి విపత్తుల నుంచి పంటలను రక్షించుకోవడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు సాగుకు పిలుపునిచ్చిందని మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత అన్నారు. గురువారం ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ నుంచి తూర్పు, పశ్చిమ, సెంట్రల్ డెల్టా కాలువలకు వారు నీటిని విడుదల చేశారు. తొలుత గోదావరికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్విచ్చాన్ చేసి గేట్లను పైకిలేపి దిగువకు గోదావరి జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడారు. ప్రస్తుతం మూడు డెల్టాలకు రెండు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. గతేడాది ముందస్తు సాగును చేపట్టడం వల్ల సత్ఫలితాలు వచ్చాయన్నారు. ఇదే తరహాలో ఈ ఏడాదీ ముందస్తు సాగుకోసం నీటిని విడుదల చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రైతుల కోసం పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. జగన్ అధికారంలోకొచ్చిన నాటి నుంచి అన్ని రిజర్వాయర్లు నీటితో కళకళలాడుతున్నాయన్నారు. హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండుగగా చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ముందస్తుగా నీటిని విడుదల చేయడం వల్ల సకాలంలో విత్తనాలు వేసేందుకు రైతులకు ఆస్కారం ఏర్పడిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఆర్‌బికెల ద్వారా రైతులకు సాంకేతికపరమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. సిఎం జగన్ ముందుచూపు వల్లే సకాలంలో సాగునీరు అందించడం సాధ్యమైందన్నారు. కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ ముందస్తు సాగుకోసం ఇప్పటికే ఇరిగేషన్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన సమన్వయ కమిటీలను వేశామన్నారు. నీటి విడుదలకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేశామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత మంత్రులు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మార్గని భరత్, ఎంఎల్ఎలు జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, డిసిసిబి ఛైర్మన్ ఆకుల వీర్రాజు, ఇరిగేషన్ సిఇ ఆర్.సతీష్‌కుమార్, ఎస్ఇ జి.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, సభ్యులు కె.తేజ, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

బటన్ నొక్కి కాలువలకు నీటిని విడుదల చేస్తున్న మంత్రులు

## నేడు, రేపు జిల్లాలో వడగాల్పులు

**45 నుంచి 47 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం**

**రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక**

**ప్రజాశక్తి - భీమవరం**

జిల్లాలో నేడు, రేపు రెండు రోజుల పాటు వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. నేడు 20 మండలాల్లో వడగాల్పులు వీయడనున్నట్లు తెలిపారు. అలాగే 45 డిగ్రీల నుంచి 47 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే రేపు 45 డిగ్రీల నుంచి 47 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నట్లు వెల్లడించారు. ఈ రెండు రోజులు పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలని విఒఎల నిరసన

**ప్రజాశక్తి - మొగల్తూరు**

విఒఎల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం మొగల్తూరులో తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి, విఒఎల మెర్జ్ నిలుపుదల చేయాలని, అన్ని రకాల బకాయిలూ చెల్లించాలని, లోకో యాప్ వర్క్ కోసం 5జి మొబైల్ ప్రభుత్వమే అందించాలని కోరారు. విఒఎల మెర్జ్‌తో ఉపాధి కోల్పోయిన వారికి నష్ట పరిహారం ఇవ్వాలని, వయస్సు, చదువు, జెండర్ పేరుతో విఒఎల తొలగింపు ఆపాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని తహశీల్దార్ అనిత కుమారికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్.విజయ, వి.వరలక్ష్మి, వై.పద్మ, కె.రాజేశ్వరి, నిర్మలాదేవి పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విఒఎలు

# రాజుకున్న ఫ్లెక్సీల వివాదం

**జనసేన జిల్లా అధ్యక్షులు చినబాబు అరెస్ట్**

**పోడూరు పోలీస్ స్టేషన్ కు తరలింపు, విడుదల**

**జనసైనికుల రాస్తారోకో**

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

భీమవరంలో ఫ్లెక్సీల వివాదం రాజుకుంది. తమ నాయకుడు పవన్ కళ్యాణ్‌ను కించపరిచే విధంగా అధికార వైసిపి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిందని, వాటిని తొలగించాలని అధికారులకు జనసేన నాయకులు వినతిపత్రాలు అందజేశారు. అధికారులు స్పందించలేదని, దానికి దీటుగా జనసేన ఫ్లెక్సీలను ఏర్పాటు చేసింది. దీనిపై గురువారం జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు (చినబాబు)ను పోలీసులు అరెస్ట్ చేసి నరసాపురం డివిజన్‌లోని పోడూరు పోలీసుస్టేషన్‌కు తరలించారు. దీంతో జనసైనికులు పోలీసు వాహనానికి అడ్డుపడ్డారు. అయినా చినబాబును పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో దీంతో ఫ్లెక్సీల వివాదం ముదిరి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రకాశం చౌక్ సెంటర్లో జన సైనికులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫ్లెక్సీలపై పవన్‌కళ్యాణ్ ఫ్లెక్సీలను జనసైనికులు అంటించడంతో వాటిని తొలగించడానికి వచ్చిన పోలీసులను జనసైనికులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, జనసైనికులకు మధ్య తీవ్ర వాగ్వివాదం, తోపులాట జరిగింది. ఈ తోపులాటలోనే పోలీసులు పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలను తొలగించారు. దీంతో భీమవరంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో జనసైనికులు పోలీసు వాహనానికి అడ్డుపడి రాస్తారోకో చేశారు. అనంతరం పోడూరు పోలీస్ స్టేషన్ నుంచి చినబాబు పార్టీ కార్యాలయానికి ర్యాలీగా వచ్చారు.

**చినబాబుకు మాజీ ఎంఎల్ఎ అంజిబాబు సంఘీభావం**

జనసేన నాయకుడు కొటికలపూడి గోవిందరావును అరెస్టు ఇంటికి చేరుకున్న కొద్ది సమయానికి మాజీ ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజి బాబు) చినబాబు నివాసానికి వచ్చి ఆయనకు సంఘీభావం తెలిపారు.

# మలేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

మలేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆలమూరు పిహెచ్‌సి డాక్టర్ ఎం.గంగానాయుడు అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా ఆయన గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. బ్యాక్టీరియా, పరాన్న జీవుల వల్ల మలేరియా వస్తుందన్నారు. మనిషికి చలి, వణుకు, ఒళ్లు నొప్పులతో కూడిన విపరీతమైన జ్వరం రోజు మార్చి రోజు వస్తుందన్నారు. లక్షణాలు ఉన్న వెంటనే ఆర్‌డిటి కిట్ ద్వారా, రక్తపూత పరీక్ష పద్ధతి ద్వారా వ్యాధి నిర్ధారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రామారావు, హెచ్ఎస్ నానిబాబు, ఎల్‌టి.విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం:** తాడేపల్లిగూడెం పట్టణ పరిధిలోని డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు వైద్యులు శ్రావ్య, అమృత అధ్యక్షతన మలేరియా మాసోత్సవాలు తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సబ్‌యూనిట్ అధికారి మాట్లాడుతూ ఏటా జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు దోమతెరలు వాడాలని, ఇంటి కిటికీలకు, తలుపులకు జాలీలు బిగించుకోవాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు కాంతారావు, వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆశాలు పాల్గొన్నారు.

**గణపవరం :** మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం కాశిపాడులో దోమలను అరికడదాం అంటూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాశిపాడు ఆరోగ్య సహాయకులు నాగుల రాజు మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకూ మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశాలు కృష్ణకుమారి, బి.వరలక్ష్మి, హేమ పాల్గొన్నారు.

పెనుమంట్ర :మలేరియాపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

## ఫ్యామిలీ డాక్టర్‌ను వినియోగించుకోవాలి

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

ప్రతి ఒకరూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఎం.గంగానాయుడు అన్నారు. గురువారం నెలమూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగానాయుడు మాట్లాడుతూ నిన్న మొన్నటి వరకూ సోమ, గురువారం సేవలందించామన్నారు. ప్రతి మొదటి, మూడో గురువారాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలో గర్భిణులు, రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.పెద్దిరాజు, ఎఎన్ఎం జి.ఐకె.దుర్గ, ఆశా వర్కర్లు దానం లక్ష్మి, తులసి, ఎంఎల్‌హెచ్ పి.సునీత పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే టిడిపి లక్ష్యం

**ప్రజాశక్తి - మొగల్తూరు**

మహిళా సాధికారతే టిడిపి లక్ష్యమని పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ శిరినిడి రాజ్యలక్ష్మి అన్నారు. మొగల్తూరులోని పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అధ్యక్షతన బూత్ కన్వీనర్ పితాని శేఖర్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజమండ్రిలో నిర్వహించిన మహానాడులో చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టో దీనికి నిదర్శనం అన్నారు. మహాశక్తి పేరుతో టిడిపి మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నారన్నారు. అనంతరం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు తిరుమల శశిదేవి, మాజీ ఎంపిటిసి సభ్యులు పాల దుర్గాభవాని, చెల్లిబోయిన విజయలక్ష్మి, దొంగ ఆదిలక్ష్మి, బాస్కాని ఏడుకొండలు పాల్గొన్నారు.

ఉండి : విద్యార్థులు వేసిన డ్రాయింగ్

## విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

**ప్రజాశక్తి - ఉండి**

ప్రతి విద్యార్థీ పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఏంజెల్ బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలు పి.నందిని సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం యండగండి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మెహందీ డిజైన్లపై ఏంజెల్ బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలు పి.నందినిచే శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నందిని మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ పోటీతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ శిబిరంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల డిజైన్లు నేర్చుకున్నారని తెలిపారు. మెహందీ డిజైన్లు, బ్యూటీ పార్లర్ కోర్సులు ప్రతి విద్యార్థీ నేర్చుకుని నైపుణ్యాన్ని సాధించడం ద్వారా ఎవరిపై ఆధారపడకుండా డబ్బులు సంపాదించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎన్‌సిహెచ్.రామకృష్ణ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేగేశ్న సత్యరాజ్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

**నరసాపురం టౌన్ :** నరసాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో 25వ రోజు గురువారం వేసవి విజ్ఞాన కొనసాగింది. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులచేత ముందుగా పుస్తక పఠనం, పత్రికా చేయించారు. అనంతరం సలాది రామారావు ఎక్స్ మిలటరీ సర్వీస్ పిల్లలకు చరిత్ర, జికె క్లాసులు నిర్వహించారు, ఉపాధ్యాయులు సిహెచ్.శ్రీనివాస్ ఇంగ్లీష్ మాట్లాడడం ఎలా ఇంగ్లీష్ గ్రామర్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూర్యంబాబు, సుధీర్‌మోహన్, సమర్పణరావు, ప్రిన్స్ ప్రవీణ్, కెవి.రావు హెచ్‌ఎం హారిక పాల్గొన్నారు.

**పాలకోడేరు :** విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించినప్పుడే వారిలో విజ్ఞానం పెరుగుతుందని తహశీల్దార్ షేక్ హుస్సేన్ అన్నారు. పాలకోడేరు శాఖా గ్రంథాలయంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి వినోదం శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వేసవి వినోదం శిబిరంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. బహుమతులు స్థానిక ఉపాధ్యాయులు వి.భారతి, రవిబాబు, పద్మజలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు లక్ష్మీనరసింహారావు, రిసోర్సు పర్సన్లు రాజేంద్రబాబు, రమేష్ బాబు, జోసఫ్, వెంకటేశ్వరరావు, భారతి, శిరీష, లత, కుమార్ పాల్గొన్నారు.

## దోమల నిర్మూలనపై అవగాహన

**ప్రజాశక్తి - పాలకోడేరు**

దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టాలంటే దోమల వృద్ధిని నివారించడం ఒక్కటే మార్గమని పాలకోడేరు పిహెచ్‌సి సిబ్బంది అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని విస్సాకోడేరులో గురువారం దోమల నిర్మూలనపై అవగాహన ప్రదర్శన చేశారు. నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు, చెత్తకుప్పలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కెఎ.శ్రీనివాస్, సిబ్బంది నాగమణెమ్మ, లలిత, గోపాలకృష్ణ, హేమ, భవాని పాల్గొన్నారు.


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

## ఆకుకూరలతో కంటి రోగాలు దూరం

**ప్రజాశక్తి - గణపవరం**

వారంలో మూడు రోజులు ఆకుకూరల వాడితే కంటి రోగాలు దూరం అవుతాయని పిప్పర గ్రామ సర్పంచి కాకర బేబి అన్నారు. మండలంలోని పిప్పర సచివాలయం వద్ద గురువారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచి బేబి ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకుని కంటిలోని లోపాలు సరిచేసుకోవాలన్నారు. గ్రామంలో 55 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి వారందరికీ కళ్లజోళ్లు అవసరమని నేత్ర వైద్యులు తెలిపారు. ప్రభుత్వం కళ్లజోళ్లు ఉచితంగా అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి ఐవి.రాజు, ఎఎన్ఎం టి.వాణిశ్రీ, ఆశా వర్కర్లు ఎం.భాగ్యమ్మ, ఐ.జయమ్మ, కె.వెంకట లీల పాల్గొన్నారు.

# పైడితల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి - కాళ్ల**

జువ్వలపాలెం గ్రామం తూర్పుపేటలో పైడితల్లి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి వచ్చి జువ్వలపాలెం తూర్పుపేటలో స్థిరపడ్డారు. సుమారు 250 సంవత్సరాలు చరిత్ర కలిగిన పైడితల్లి అమ్మవారికి రావిచెట్టు వద్ద పూజలు నిర్వహించేవారు. ఆలయ నిర్మాణ కమిటీగా ఏర్పడి ఆలయ నిర్మాణం సుమారు రూ.50 లక్షలతో చేపట్టాలని తలంచారు. గురువారం ఆలయ నిర్మాణానికి ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు, ఉండి నియోజకవర్గజనసేన ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిఎన్ఆర్ కళాశాల అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు, గోకరాజు శివ బాబు, సర్పంచి మీసాల రమణ, ఉప సర్పంచి కతారి లక్ష్మీపతిరాజు, రుద్రరాజు రామకృష్ణంరాజు, ముదుండి సురేష్‌రాజు, మాజీ ఎంపిటిసి నడింపల్లి విశ్వనాథరాజు, మాజీ ఉప సర్పంచ్ గోకరాజ్ వినోద్ రంగరాజు, మండల కో ఆప్షన్ సభ్యుడు గుర్రం జార్జ్ బెనార్, మంతెన పెద నరసింహరాజు, దండు వెంకట కృష్ణంరాజు, గోకరాజు నాగరాజు, నడింపల్లి ప్రదీప్‌రాజు, ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ మీసాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న డిసిసిబి పివిఎల్ నరసింహరాజు

## గోవిందరావు అరెస్టుపై జనసేన నిరసన

**ప్రజాశక్తి - తణుకు**

జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) అక్రమ అరెస్టును ఖండిస్తూ ఆ పార్టీ తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు ఆధ్వర్యంలో పట్టణంలోని నరేంద్ర సెంటర్ వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ గోవిందరావును వెంటనే విడుదల చేయాలని, ఫ్లెక్సీలను తొలగించాలని డిమాండ్ చేశారు. **సిపిఎం ఖండన**

**భీమవరం :** జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు (చినబాబు) అరెస్టును సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఖండించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫ్లెక్సీ పేరుతో అరెస్టు అక్రమమని, రాష్ట్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక నిరంకుశ వైఖరిని తెలియజేస్తోందని పేర్కొన్నారు.

**పోడూరు :** వైసిపి ప్రభుత్వం విధ్వంసాలు సృష్టించాలని చూస్తే తాము చూస్తూ ఊరుకోబోమని జనసేన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు గోవిందరావు అన్నారు. స్టేషన్ నుంచి విడుదలైన తర్వాత గోవిందరావు మాట్లాడారు. పవన్‌కల్యాణ్‌ను కించపరుస్తూ ఫ్లెక్సీలు కడితే సహించేది లేదన్నారు. అత్యంత అవినీతి పరుడు సిఎం జగన్ మోహన్ రెడ్డి అని విమర్శించారు.

## కార్మికులు గుర్తింపు కార్డులు పొందాలి

**ప్రజాశక్తి - తణుకురూరల్**

భవన నిర్మాణ కార్మికు లందరూ సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరి కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు పొందాలని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు యర్ర మల్లికార్జునరావు అన్నారు. వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం స్థానిక పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో వాటాల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో రెండు దశబ్దాల పాటు సాగించిన అనేక పోరాటాలు కారణంగా సంక్షేమ బోర్డు ఏర్పాటైందన్నారు. ఈ బోర్డు ప్రారంభించిన మొదట్లో కార్మికులకు ఉపయోగపడే అనేక సంక్షేమ పథకాలు ఈ బోర్డు ద్వారా అమలు చేసేవారని ఆయన గుర్తుచేశారు. తర్వాత నాటి టిడిపి, నేటి వైసిపి ప్రభుత్వం పోటీపడి తమ వ్యక్తిగత సంక్షేమ పథకాల అమలు కోసం సంక్షేమ బోర్డులో నిల్వ ఉన్న కోట్లాది రూపాయలను దారి మళ్లించి సంక్షేమ బోర్డును ఉత్సవ విగ్రహంలా మార్చారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సంక్షేమ బోర్డు నుండి రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన నిధులను వెంటనే బోర్డుకు జమచేసి పెండింగ్‌లో ఉన్న క్లైములు పారితోషకాలు మంజూరు చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోరపల్లి రామకృష్ణ, దొంతంశెట్టి ముకేంద్రరావు, కర్ణాటక వెంకటేశ్వరరావు, నక్కా సత్యనారాయణ, అందే కోట బసవయ్య, విశ్వనాథం సుబ్బారావు, కరెళ్ల అర్జున్ పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు అందుకుంటున్న కార్మికులు

## కిడ్నీ వ్యాధి బాధితునికి పెన్షన్ మంజూరు

**ప్రజాశక్తి - పోడూరు**

మండలంలోని గుమ్ములూరు గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధి బాధితుడు మండెల సూర్యనారాయణకు రూ.పది వేల పెన్షన్ సొమ్మును గ్రామ సర్పంచి గొట్టుముక్కల సోనియా రమేష్ గురువారం అందించారు. రెండు కొంతకాలం క్రితం రెండు కిడ్నీలు పాడై సూర్యనారాయణ అనారోగ్య పాలయ్యాడు. గ్రామ సర్పంచి ఈ విషయాన్ని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీమంత్రి, స్థానిక ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సూర్యనారాయణకు పెన్షన్ మంజూరయ్యేలా ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు కృషి చేశారు. సూర్యనారాయణకి రూ.10 వేల పెన్షన్ ప్రభుత్వం నుంచి మంజూరు కావడంతో ఆ సొమ్మును అతనికి అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ బొక్క వెంకటకృష్ణ, పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణవర్మ పాల్గొన్నారు.

## సమస్య పరిష్కారమయ్యేవరకూ పర్యవేక్షించండి

**అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం**

**ప్రజాశక్తి - వీరవాసరం**

ఫిర్యాదుదారుడి సమస్యకు పరిష్కారం లభించే వరకు అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. వీరవాసరం తహశీల్దార్ కార్యాలయంలో గురువారం స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులపై అధికారులతో సమీక్షించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, మౌలిక సదుపాయాలు, రెండో దశ రీసర్వే పనులను సంబంధిత అధికారులతో శాఖల వారీగా సమీక్షించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులు పరిష్కారమయ్యేటట్లు చూడాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిపడే విధంగా సమస్యలను పరిష్కరించాలన్నారు. పరిష్కారం చూపిన తరువాత అవసరమైతే ఫిర్యాదుదారుడితో మాట్లాడాలన్నారు. ఫిర్యాదు రీ ఓపెన్ అవ్వకూడదన్నారు. కింది స్థాయి ఉద్యోగులకు ఫిర్యాదులను అప్పచెప్పడం వల్ల సమస్య పరిష్కారం కాకపోవడంతో పాటు రీ ఓపెన్ అయ్యే అవకాశం ఉందన్నారు. ఫిర్యాదు క్షుణంగా పరిశీలించిన తరువాతే పరిష్కారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, హౌసింగ్ ఇఇ బి.వెంకటరమణ, తహశీల్దార్ సుందరాజు, ఎంపిడిఒ ఉమామహేశ్వరావు, వ్యవసాయాధికారిణి గీతాదేవి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

## కొత్తూరులో అన్నసమారాధన

**ప్రజాశక్తి - ఆచంట**

ఆచంట కొత్తూరు శివారున నూతనంగా నిర్మించిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయం వద్ద గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి విగ్రహ పున:ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యాత్రికుల విరాళాలతో ఆలయాన్ని సుందరంగా నిర్మించారు.. ఈ సందర్భంగా సూరిశెట్టి ఏకాంబరీశ్వరం దంపతులు విగ్రహ ప్రతిష్ట చేశారు. అనంతరం బ్రహ్మశ్రీ మనేపల్లి సాంబశివరావు, వేదపండితుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాత్రికులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం సుమారు రెండు వేల మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

## పెడాయికోడు ప్రక్షాళన పనులు వేగవంతం

పనులను పర్యవేక్షిస్తున్న ఉప సర్పంచి కల్యాణ్ వర్మ

**ప్రజాశక్తి - ఉండి**

ఎంతో ప్రతిష్టాత్మకంగా ఉండి గ్రామపంచాయతీ ప్రారంభించిన పెడాయికోడు పనులను గురువారం ఉండి ఉప సర్పంచి గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కల్యాణ్ వర్మ మాట్లాడుతూ పెడాయి కోడు ద్వారా గతంలో మంచి నీరు సరఫరా జరిగేదని, కాలక్రమేనా అది మురుకు కాలువగా మారిపోయిందని చెప్పారు. పెడాయికోడు వెంబడి చెత్త పదార్థాలు, ఘన, ద్రవ వ్యర్థాలను కాలువలోకి వదిలేయడంతో మురికి కాలువగా మారిపోయిందన్నారు. నాటి నుంచి నేటి వరకు పూడిక పనులు చేపట్టకపోవడంతో దీని నుంచి వెలువడే దుర్గంధం వల్ల చుట్టుపక్కల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కొందరు పంచాయతీ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు దృష్టికి ఈ విషయాన్ని తమ పాలకవర్గం తీసుకువెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చూశామని కల్యాణ వర్మ తెలిపారు. పివిఎల్ నరసింహరాజు ఆదేశాల మేరకు పెడాయికోడు ప్రక్షాళన పనులను వేగవంతం చేసినట్లు ఆయన అన్నారు.

# అలుపెరగని ఉద్యమకారుడు కవురు సుబ్బారావు

## సంస్మరణ సభలో వక్తలు

**ప్రజాశక్తి - నరసాపురం టౌన్**

ప్రగతిశీల కమ్యూనిస్ట్ నాయకుడు, అలుపెరగని ఉద్యమకారుడు కవురు సుబ్బారావు అని పలువురు వక్తలు అన్నారు. కవురు సుబ్బారావు సంస్మరణ సభ మల్లవరంలంకలో మండల కమిటీ సభ్యులు జల్లి రామమోహన్‌రావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ ప్రగతిశీల కమ్యూనిస్టు నాయకుడు, అలుపెరగని యోధుడు కవురు సుబ్బారావు అని, ఆయన నిరంతరం ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటం చేశారని కొనియాడారు. పట్టణ కార్యదర్శి ముచర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ కవురు సుబ్బారావు నిరంతరం పార్టీ అభివృద్ధి కోసం పాటు పడేవారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు పొగాకు పూర్ణ మాజీ మండల కార్యదర్శి పూరిల్ల శ్రీనివాస్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నాయకులు మామిడిశెట్టి రామాంజనేయులు, పార్టీ పట్టణ కమిటీ సభ్యులు, నాయకులు రాము, నీలకంటం, నారాయణరావు పాల్గొన్నారు.

కవురు సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

# యువతకు కుట్టుమిషన్, మగ్గం వర్క్‌పై శిక్షణ

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

త్రి ఎఫ్ ఇండస్ట్రీస్ స్వాభిమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 60 మంది యువతకు కుట్టుమిషన్, మగ్గం వర్క్‌పై శిక్షణ ఇస్తున్నట్లు త్రి ఎఫ్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ జె.జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రచర్ల, ప్రత్తిపాడు, అల్లంపురం, జువ్వాలపాలెంలోని యువతకు కుట్టుమిషన్, మగ్గం వర్క్‌పై 60 రోజుల పాటు అనుభవజ్ఞులచే శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**నేరాలు.. ఘోరాలు..**

## మురుగు కాలువలో పసికందు మృతదేహం

**ప్రజాశక్తి - పాలకొల్లు**

పాలకొల్లులో హృదయ విదారక ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానిక రిలయన్స్ పెట్రోల్ బంక్ సమీపంలోని కల్వర్టు వద్ద ఆడ పసికందు మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పసకందు మృతదేహం వేరే ప్రాంతం నుంచి కొట్టుకువచ్చినట్లు అధికారులు భావిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఫ్లెక్సీ చింపిన వ్యక్తిపై కేసు

**ప్రజాశక్తి - పాలకొల్లు**

పాలకొల్లులో వైసిపి వారు కట్టిన ఫ్లెక్సీని చింపినందుకు జనసేన నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్‌ను పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వైసిపి నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రేమ్‌కుమార్ పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ డి.రాంబాబు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

## యోగాతో మానసిక ఉల్లాసం

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

మండలంలోని జుత్తిగ సచివాలయం వద్ద నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో గురువారం లైఫ్ స్టైల్ ఫర్ ఇన్విరాన్‌మెంట్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జుత్తిగ సెక్రటరీ మునియ్య మాట్లాడుతూ ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి యోగా చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వాలంటీర్లు, సిబ్బంది, నెహ్రూ యువకేంద్ర వాలంటీర్ జక్కంశెట్టి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

**దస్తావేజులు పోయినవి**

ఏలూరు జిల్లా, పెదవేగి మండలం, వంగూరు గ్రామ కాపురస్తులైన మద్దుల జార్జ్, S/o. పోతురాజు (లేటు) తెలియచేయునది ఏమనగా, సర్వే నెం. 157-1, డాక్యుమెంట్ నెం. 2844/1996 గల పొలం దస్తావేజులను జిరాక్స్ నిమిత్తం వంగూరు నుండి ఏలూరు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో జారి పడిపోయినవి. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

**మద్దుల జార్జ్**
**సెల్: 9963806596**

**పాస్‌పోర్టు పోయినది**

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, నడిపూడి గ్రామ కాపురస్తురాలైన కట్టా శ్రీను భార్య అయిన కట్టా వెంకటలక్ష్మి **Passport No. P7895363** రుతో Passport కలిగియున్నాను. ది. 30-04-2023వ తేదీన ఆటోలో పెనుమంట్ర గ్రామం నుండి మార్టేరు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో ఎక్కడో పాస్ పోర్టు కలిగి ఉన్న కవరు పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

**కట్టా వెంకటలక్ష్మి, W/o. కట్టా శ్రీను**
**డోర్ నెం. 2-72, నడిపూడి**
**పెనుగొండ మండలం, పశ్చిమగోదావరి జిల్లా**
**పిన్‌కోడ్: 534123, సెల్: 8499829978**

**CHANGE OF NAME**

I, **VEMULAPALLI SARAT CHANDRA BOSE**, S/o. Vemulapalli Lakshmaiah, and Residing @ D.No. 13-193, MIG-151, APHB Colony, Vatluru, Pedapadu, Eluru (R) -534007. Changing my Name **VEMULAPALLI SARAT CHANDRA** (Old Name) to **VEMULAPALLI SARAT CHANDRA BOSE** (New Name), S/o. Vemulapalli Lakshmaiah. Hence, forth I am being called as **VEMULAPALLI SARAT CHANDRA BOSE** for All purposes.

**పాస్‌పోర్టు పోయినది**

పశ్చిమగోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, మాముదూరు గ్రామం, బొక్కవారి పాలెం గ్రామ కాపురస్తుడైన దొంగ శ్రీను, తండ్రి: సుబ్బారావు అను నాకు **G6838890** నెంబరు గల పాస్‌పోర్టు గత నెల ది. 01-05-2023వ తేదీన మోటారు సైకిల్‌పై మాముదూరు గ్రామం నుండి బ్రాహ్మణచెర్వు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో ఎక్కడో పాస్‌పోర్టు కలిగి ఉన్న కవరు ఎక్కడో పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

**దొంగ శ్రీను, తండ్రి: సుబ్బారావు,**
**డోర్ నెంబర్: 2-113-1, బొక్కవారిపాలెం**
**మాముదూరు గ్రామం, పెనుమంట్ర మండలం**
**పశ్చిమగోదావరి జిల్లా, పిన్‌కోడ్: 534230**
**సెల్: 9908382707**

**లింకు డాక్యుమెంట్ దస్తావేజు పోయినది**

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియచేయునది ఏమనగా, నా క్లయింట్ శ్రీమతి కోమలి లక్ష్మి, భర్త: శ్రీను గారికి తాడిపర్రు గ్రామంలో గల డాక్యుమెంట్ నెం. 8614/2019 హక్కు విడుదల దస్తావేజు పొందియుండెను. సదరు ఆస్తి గృహ నిర్మాణం చేయుట కొరకు వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, తణుకు బ్రాంచ్ నందు ఋణం తీసుకొనుచున్నారు. సదరు ఆస్తికి సంబంధించి లింకు డాక్యుమెంట్ ఒరిజినల్ రిజిష్టర్ దస్తావేజు నెం. 5967/2011, ఈ లింకు దస్తావేజు జిరాక్స్ కాపీలు తీసుకొనుటకు వెళ్ళుచుండగా ఈ దస్తావేజు కవరు తప్పిపోయినది. కావున ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ దొరికినవారు ఈ దిగువ ఇవ్వబడిన నా క్లయింట్ చిరునామాకు వాపస్ చేయగలరు.

**పార్టీ వివరములు: పేరు: కోమలి లక్ష్మి, W/o. శ్రీను, డో.నెం. 1-40/2, తాడిపర్రు, ఉండ్రాజవరం మండలం.**

**A.NAGESWARA RAO**
**Advocate & Notary**
**Tanuku, Cell: 9110382946**

**పురపాలక సంఘ కార్యాలయం, నరసాపురం**

ఆర్.ఓ.సి. నెం. 175/2023/ఇ2, తేది:01-06-2023

**వేలం ప్రకటన**

నరసాపురం పురపాలక సంఘ పరిధిలోని 2వ వార్డు హెడ్ వాటర్ వర్క్స్ నందు గల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లోని చేపలను పట్టుకొను హక్కులు పొందుటకు బహిరంగ వేలము ది. 08-06-2023వ తేది మధ్యాహ్నం గం॥ 3.30 ని॥లకు ఈ కార్యాలయము నందు కమిషనరు వారు లేదా వారి అనుమతి పొందిన అధికారిచే గాని బహిరంగ వేలము నిర్వహించబడును. అందు పై సదరు పాటలో పాల్గొను అభ్యర్థులు ధరావత్తుగా రూ. 25,000/-లు నగదుగా డిపాజిట్ చేసి పాటలో పాల్గొనవచ్చును. పూర్తి సమాచారం కొరకు ఈ కార్యాలయ పని వేళల యందు ఈ విభాగము నందు సంప్రదించగలరు.

సం/- **కమిషనరు**
నరసాపురం పురపాలక సంఘం

**సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ, కోటా రామచంద్రపురం, ఏలూరు జిల్లా**

ఆర్.సి. నెంబర్: 3/టెండర్స్/2023-24 **టెండరు ప్రకటన** తేదీ: 31-05-2023

సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ, కోటా రామచంద్రపురం, ఏలూరు జిల్లా పరిధిలో గల ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలు మరియు కళాశాలలు నందు గల గురుకుల వసతి గృహములకు 2023-24 విద్యాసంస్థలకు కూరగాయలు, పాలు, పండ్లు, చికెన్, మటన్, స్వీట్, హాట్ సరఫరా చేయుటకు వ్యక్తులు మరియు సంస్థల నుండి సీలు వేసిన టెండర్లు కోరబడుచున్నవి.

టెండర్లు దాఖలు చేయదలచిన వారు నియమ నిబంధనలతో కూడిన టెండర్ షెడ్యూల్స్ ఒక్కొక్క దానికి రూ. 500/- చొప్పున ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల (బాలురు), కోట రామచంద్రపురం నందు తేదీ. 31-05-2023 నుండి తేదీ. 07-06-2023 మధ్యాహ్నం 12.00 గంటలకు పొందవచ్చును. పూర్తి చేసిన టెండర్ షెడ్యూల్స్ తేదీ. 07-06-2023 మధ్యాహ్నం 1.00 గంటలోగా ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల (బాలురు), కోట రామచంద్రపురం వారి వద్ద ఉంచబడిన టెండర్ బాక్స్ నందు నిర్ణయించిన ఇ.యం.డి.తో పాటుగా వేయవలెను. స్వీకరించిన టెండర్ షెడ్యూల్స్ తేదీ. 08-06-2023 మధ్యాహ్నం 3.00 గంటలకు హాజరైన టెండర్ దారుల సమక్షంలో శ్రీయుత ప్రాజెక్ట్ అధికారి గారు, ఐ.టి.డి.ఎ., కె.ఆర్.పురం మరియు జిల్లా కార్యదర్శి, గురుకులం, ఏలూరు జిల్లా వారి కార్యాలయం నందు తెరిచి ఖరారు చేయబడును.

◆ ఏ కారణము తెలపకుండా టెండర్లు రద్దు చేయుటకు మరియు తేదీని పొడిగించుటకు కమిటీ వారికి అధికారం కలదు.

సం/- **ప్రాజెక్ట్ అధికారి/ జిల్లా కార్యదర్శి,** ఐ.టి.డి.ఎ., కె.ఆర్.పురం, ఏలూరు జిల్లా